# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఏడు దశల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల షెడ్యూలును కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది
2. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల శాసనసభలకు కూడా ఎన్నికలు జరుగుతాయి
3. రాబోయే ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ 24 ఎంపీ, 175 ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను ప్రకటించింది
4. ఆంధ్రప్రదేశ్‌లో ఇవాళ గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది.
5. తెలంగాణ గ్రూప్ వన్ దరఖాస్తుల గడువు శనివారంతో ముగిసింది.

==========================

లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో జరుగుతాయి. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికలు, నాలుగు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు. మొదటి దశలో ఏప్రిల్ 19న 102 లోక్‌సభ స్థానాలకు.... రెండవ దశలో ఏప్రిల్ 26న 89 స్థానాలకు... ఎన్నికలు జరుగుతాయి. మూడవ దశలో మే 7న 94 సీట్లకు... నాలుగవ దశలో మే 13న 96 సీట్లకు... ఎన్నికలు జరుగుతాయి. ఐదవ దశలో మే 20న 49 స్థానాలకు... ఆరవ దశలో మే 25న 57 స్థానాలకు... ఎన్నికలు నిర్వహిస్తారు. చిట్టచివరి ఏడవ దశలో జూన్ 1న 57 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది.

-------------------------

లోక్‌సభ ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల శాసనసభలకు కూడా ఎన్నికలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం తేదీలు ఖరారు చేసింది. 175 నియోజకవర్గాలున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సార్వత్రిక ఎన్నికల నాలుగవ దశలో... అంటే మే 13న ఎన్నికలు జరుగుతాయి. 147 స్థానాలున్న ఒడిషా శాసనసభ ఎన్నికలు నాలుగు విడతల్లో... మే 13, 20, 25.. జూన్ 1న జరుగుతాయి. 60 సీట్లున్న అరుణాచల్ ప్రదేశ్, 32 సీట్లున్న సిక్కిం శాసనసభలకు ఒకే విడతలో ఏప్రిల్ 19న ఎన్నికలు జరుగుతాయి. ఆ నాలుగు రాష్ట్రాల్లోనూ పార్లమెంటు, శాసనసభ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి.

-------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదలవుతుంది. నామినేషన్లు దాఖలు చేయడానికి ఏప్రిల్ 25 వరకూ గడువుంది. నామినేషన్ల పరిశీలనకు ఏప్రిల్ 26 వరకూ అవకాశముంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకూ వీలుంది. రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల కోసం మే 13న పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహిస్తారు.

-----------------------------

దేశంలో రిజిస్టర్డ్ ఓటర్లు 97కోట్ల మంది ఉన్నారని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి పదిన్నర లక్షలకు పైగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఎన్నికల నిర్వహణ, భద్రతా విధుల్లో కోటిన్నర మంది సేవలందిస్తారని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో కోటీ 82లక్షల మంది యువతీ యువకులు మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకుంటారు. దేశ ఎన్నికల చరిత్రలో మొదటిసారిగా 85ఏళ్ళ వయసు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటినుంచే ఓటు వేసే సదుపాయం కల్పిస్తున్నారు.

-----------------------------

దేశంలో అవినీతిని సమూలంగా నిర్మూలించడానికి, అభివృద్ధిని సాకారం చేయడానికీ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తమకు అండగా నిలవాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలను కోరారు. కర్ణాటకలోని కలబురగిలో ఒక బహిరంగ సభలో మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, జలజీవన్ మిషన్, ఉజ్వల యోజన, పీఎం ఆవాస్ యోజన వంటి పథకాలను అమలు చేసిందన్నారు. కలబురగిలో జాతీయ రహదారి, రైల్వేలైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కర్ణాటకను వ్యవసాయ, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వాగ్దానం చేసారు.

-----------------------------

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సీపీ, రాబోయే ఎన్నికలకు తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు 24 ఎంపీ అభ్యర్థులు, 175 ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. ఎమ్మెల్యే సీట్లలో ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, బీసీలకు 48, మైనారిటీలకు 7 కేటాయించామని, వారిలో మహిళలు 19 మంది ఉన్నారనీ జగన్ చెప్పారు. అలాగే ఎంపీ సీట్లలో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు 11 సీట్లు కేటాయించామనీ, వారిలో 5గురు మహిళా అభ్యర్థులు ఉన్నారనీ వివరించారు. మొత్తం మీద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50శాతం సీట్లు కేటాయించామని జగన్మోహనరెడ్డి చెప్పారు.

-----------------------------

ఎన్నికల ప్రకటన వచ్చిన నాటి నుంచీ రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 24 గంటల్లోగా ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల గోడరాతలు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు అన్నీ తొలగించాలని ఆదేశించారు. బస్ స్టాండ్ లు, రైల్వే స్టేషన్లు, రైల్వే,రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలపై రాజకీయ ప్రకటనలు, గోడరాతలు,

పోస్టర్లు,కటౌట్లు తొలగించాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ఫోటోలను వెంటనే తొలగించాలని డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

రాబోయే ఎన్నికలకు రాష్ట్రంలో 46వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి నెలాఖరులోగా కార్డులు అందజేస్తామన్నారు. ఓటరు కార్డు లేకపోతే 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చని వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఇతర కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామన్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లో 4లక్షల మంది ఉద్యోగులను వినియోగిస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంచుతామని సీఈఓ ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇవాళ గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 89 ఉద్యోగాలకు గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇవ్వగా, ఈ పరీక్షకు సుమారు లక్షన్నర మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుగా ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లా కేంద్రాల్లో 301 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేసారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జనరల్ స్టడీస్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకూ జనరల్ ఆప్టిట్యూడ్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రిలిమ్స్ పరీక్ష పర్యవేక్షణకు 18 జిల్లా కలెక్టరేట్లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసారు. ఏపీపీఎస్సీ నుంచి 39మందికి పరీక్ష పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. 301 మంది లయజనింగ్ అధికారులు, 6612 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

---------------------------

తెలంగాణ గ్రూప్ వన్ దరఖాస్తుల గడువు శనివారంతో ముగిసింది. ఇప్పటి వరకు 4.03లక్షల దరఖాస్తులు అందినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు వెల్లడించారు. మార్చి 23 నుంచి 27 వరకు సవరణలకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 563 గ్రూప్ వన్ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ విడుదలైంది. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 9న, మెయిన్స్ అక్టోబర్ 21నుంచి నిర్వహిస్తారు.

---------------------------

రాష్ట్రంలో 6 జిల్లాల్లోని 87 మండలాలను కరవు మండలాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈశాన్య రుతు పవనాల సీజన్‌లో సరైన వర్షాలు లేకపోవడంతో ఆ మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంది. 63 మండలాల్లో తీవ్ర స్థాయిలోనూ, 24 మండలాల్లో ఒకమోస్తరుగానూ కరవు ఉన్నట్టు ప్రకటించింది. నెల్లూరు జిల్లాలో 10, కర్నూలులో 18, నంద్యాలలో 13, అనంతపురంలో 14, సత్యసాయి జిల్లాలో 1, ప్రకాశంలో 31 మండలాలు కరవు బారిన పడినట్టు ప్రభుత్వం పేర్కొంది. ఆ మండలాల్లోని రైతులకు పంటనష్టం పరిహారం దక్కేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపింది.

---------------------------

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర శనివారం ముంబైలో ముగిసింది. 63 రోజుల పాటు నిర్వహించిన ఈ యాత్రను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైత్యభూమి దగ్గర రాజ్యాంగ ప్రవేశికను చదివి ముగించారు. రాహుల్ ఈ యాత్రను జనవరి 14న మణిపూర్‌లో మొదలుపెట్టారు. దేశ ప్రజలకు

న్యాయం, సమానత్వం చాలా ముఖ్యమని... వాటిని సాధించడమే తమ ఎన్నికల లక్ష్యమని... రాహుల్ గాంధీ వెల్లడించారు.

---------------------------

కర్నూలులో పైలెట్ శిక్షణ ప్రారంభించేందుకు ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీకి గుర్తింపు లభించినట్లు ఆ సంస్థ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్షిప్ తో శిక్షణ అందించేందుకు అకాడమీ ఆలోచిస్తోందని ఆయన తెలిపారు. యువత ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రోత్సహించాలని, వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగం ద్వారా ఎక్కువ మంది యువత ప్రయోజనాలు పొందడమే తమ లక్ష్యమనీ ఆయన వివరించారు.

======================